Follow: @ANNTELUGU
REGISTERED NUMBER
APTEL/2014/58382
16-02-2026
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 49 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD సోమవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## చేతులెత్తేసిన పాకిస్థాన్


**టీమిండియా దెబ్బకు చిత్తు.. 61 పరుగుల తేడాతో భారీ విక్టరీ**

**పాక్ జట్టుకు కాళరాత్రిని మిగిల్చిన భారత క్రికెటర్లు**

**మహా:** టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా మరో సునాయాస విజయం సాధించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ముందు బ్యాటింగ్‌లోనూ, తర్వాత బౌలింగ్‌లోనూ మెరిసి పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో టీమిండియా సూపర్ 8కి క్వాలిఫై అయిపోయింది. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో మ్యాచ్ జరిగింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ 114 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లు సమష్టిగా రాణించి పాక్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు.

మిగతా 2లో

టాప్ న్యూస్



అమెరికా వాణిజ్య ఒప్పందంపై
### మోదీ సర్కార్‌పై రాహుల్ దాడి
- ప్రధాని మోదీకి 5 సూటి ప్రశ్నలు
- భారత వ్యవసాయంపై అమెరికా పట్టు

02



### నేడు ఏపీకి బిల్ గేట్స్
- సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై చర్చలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి

02



26న విజయ్ దేవరకొండ,
### రష్మిక వివాహం
- ఉదయ్ పూర్ లోని ప్యాలస్ లో పెళ్లి వేడుక

08



# సర్వం శివమయం

## శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

**హర హర మహాదేవ'శంభోశంకర అంటూ భక్తుల జయధ్వనాలు.. తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాలు కిటకిట**

**శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, వేయిస్తంభాలగుడి సహా ఆలయాలకు పోటెత్తిన భక్తులు**

**మహా నెట్ వర్క్ :** మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆంధ్ర, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, పరమశివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు 'ఓం నమఃశివాయ' నామస్మరణతో మార్మోగిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, వేయిస్తంభాలగుడి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు, శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు.

వివరాలు 2లో



బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి
### భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

**మహా:** బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ఢాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

మిగతా 2లో



### జనజీవన స్రవంతిలోకి రావాలి
మావోయిస్టులకు డిజిపి పిలుపు

**హైదరాబాద్, మహా :** అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన పిలుపుమేరకు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న వారంతా తిరిగి వచ్చి తమ కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతమైన, సురక్షితమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని డిజిపి పేర్కొన్నారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల నిరంతర కృషి ఫలితంగా వివిధ స్థాయిలకు చెందిన 588 మంది తెలంగాణ, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు లొంగిపోయి సాధారణ జీవితంలోకి ప్రవేశించారని ఆయన ఈ సందర్భంగా

మిగతా 2లో

# హంగూ హస్తగతమే

## నేడు మేయర్, ఛైర్మన్ల ఎన్నిక

**నిజామాబాద్ లో చక్రం తిప్పిన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

కరీంనగర్ లో చక్రం తిప్పుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్.. జగిత్యాల ఎపిసోడ్ కు హైకమాండ్ తెర


తొర్రూరులో చక్రం తిప్పిన ఝాన్సీరెడ్డి.. ఎర్రబెల్లికి చెక్

ఆదిలాబాద్ లో చక్రం తిప్పిన కంది.. కాంగ్రెస్ గూటికి స్వతంత్రులు

కందికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిల ఫోన్లు

ఆదిలాబాద్ గెలుపుకోసం నరేష్ జాదవ్, కంది శ్రీనివాసరెడ్డిల కృషి

కామారెడ్డిలో చక్రం తిప్పిన షబ్బీర్ అలీ.. కాగజ్ నగర్, ఆసిఫాబాద్ లలో కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు



కాంగ్రెస్ గూటికి చేరిన ఆదిలాబాద్ స్వతంత్రులతో కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

**(మహా నెట్ వర్క్ )**

తెలంగాణ మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం ముఖ్యమంత్రి, మంత్రులు, పార్టీ నేతలు తీవ్రంగా కష్టపడుతున్నారు. కాంగ్రెస్ లో ఈ స్థాయి పట్టుదల, వ్యూహ నిర్మాణం గతంలో కనబడలేదు. మునిసిపల్ ఎన్నికల్లో 70కు పైగా మునిసిపాలిటీలు ఇప్పటికే కాంగ్రెస్ కు దక్కగా, ఏ పార్టీకి మెజారిటీ దక్కని మునిసిపాలిటీలు కైవసం చేసుకునేదిశగా కాంగ్రెస్ గీసిన స్కెచ్ కొలిక్కివచ్చింది. ముఖ్యమంత్రి మంత్రులతో నిర్వహించిన భేటీలో ప్రతీ హంగ్ మునిసిపాలిటీపై చర్చించడంతో పాటు ప్రత్యేక బాధ్యులను కూడా నియమించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కృషి నిజామాబాద్ కార్పోరేషన్ హస్తగతమవుతోంది. ఇక్కడ బిజెపి పెద్ద పార్టీగా అవతరించినా మెజారిటీకి 2సీట్ల దూరంలో ఉన్న పరిస్థితిని కాంగ్రెస్ అవకాశంగా మలుచుకుంది. పీసీసీ చీఫ్ మహేష్ ఎత్తుగడలతో నిజామాబాద్ మేయర్ హస్తగతమవుతోంది. ఇండిపెండెంట్లు, బీఆర్ఎస్, ఎంఐఎంతో కలిపి ఈ కార్పోరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరేయనుంది. భైంసా, రాయికల్, అమరచింత, మెట్ పల్లి, కాగజ్ నగర్, నారాయణపేట, కామారెడ్డి,

మిగతా 2లో

## కరీంనగర్ పవర్ పాలిట్రిక్స్

- బండి సంజయ్ వర్సెస్ కాంగ్రెస్
- క్షణక్షణం మారుతున్న రాజకీయ పరిణామాలు
- మేయర్ పీఠంపై కాంగ్రెస్ గురి..
- రంగంలోకి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం



**కరీంనగర్ మహా :** కరీంనగర్ పవర్ పాలిట్రిక్స్ పిక్ దశలోకి చేరుకున్నాయి.. క్షణం క్షణం కార్పొరేషన్ రాజకీయం నరాలు తిరిగే ఉత్కంఠ రేపుతోంది. రాష్ట్ర మొత్తం కరీంనగర్లో ఏం జరగబోతుందని ఆసక్తిగా ప్రజలంతా గమనిస్తున్నారు. మేయర్ పీఠంపై పార్టీలు వేస్తున్న ఎత్తుగడలు సంచలనం రేపుతున్నాయి. బిజెపి కాంగ్రెస్ నేతలు మేయర్ పీఠం దక్కించుకోవడానికి ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. స్వతంత్రుల మద్దతుతో మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని బీజేపీ ధీమాతో ఉంటే 'ఇదంతా రాజకీయం..

మిగతా 3లో


పాలకుడిగా నేను ఎప్పుడూ
# ప్రవర్తించలేదు
## సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా...

**అన్ని వర్గాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం**

**సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు**

**హైదరాబాద్, మహా:** తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు 3 మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్య



క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**లంబాడీలు నాకు అండగా నిలిచారు**

తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిదన్న సీఎం రేవంత్, వారికి సముచిత స్థానం కల్పించాలని

మిగతా 2లో

## అక్షర చిట్ ఫండ్స్ డైరెక్టర్ అరెస్ట్

### అమెరికాకు పారిపోతుండగా అదుపులోకి...

**కోర్టులో హాజరు.. రిమాండ్ కు తరలింపు.. కోట్లు కొల్లగొట్టిన మోసగాళ్ళకు షాక్**

**వరంగల్ ప్రతినిధి, మహా ;** చిట్ ఫండ్ ల పేరుతో కొంతమంది యజమానులు ప్రజలను మోసం చేస్తూ చీటీ ఎత్తిన తరువాత పెట్టుబడిదారులను నిండా ముంచుతున్నారు. గడువు తీరాక చిట్ ఫండ్ యజమానులు కొందరు డబ్బులు లేవని కొంతమంది బాధితులకు పనికిరాని ఫ్లాట్లను కూడా అంటగడుతున్నారని కొంతమంది బాధితులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కొందరు అధికారులు వారికి మద్దతుగా నిలడం పై గతంలో అనేక విమర్శలు బహిరంగంగా వినిపించాయి. అమాయకపు ప్రజలు కష్టపడి పైసా పైసా పోగుచేసి చీటీలు వేస్తే చిట్ ఫండ్ యజమానులు మాత్రం వారికి అనేక ఆశలు చూపి చివరకు లక్షల నుంచి కోట్లు కొల్లగొట్టడం పరిపాటిగా మారింది. బాధితులు చీటీ

మిగతా 2లో



# సర్వం శివమయం

## శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

**హర హర మహాదేవ'శంభోశంకర అంటూ భక్తుల జయధ్వనాలు.. తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాలు కిటకిట**

**శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, వేయిస్తంభాలగుడి సహా ఆలయాలకు పోటెత్తిన భక్తులు**

(మహా నెట్ వర్క్)



మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆంధ్ర, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, పరమశివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు 'ఓం నమఃశివాయ' నామ స్మరణతో మార్మోగిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, వేయిస్తంభాలగుడి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు, శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జగిరాయి. రాత్రి వేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**భక్తుల ప్రత్యేక పూజలు..**

శ్రీకాళహస్తిలో మహా శివరాత్రి ఉత్సవాలు మొదలైయ్యాయి. సర్వాంగ సుందరంగా అధికారులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. రాత్రికి స్వామివారికి నంది వాహన సేవ కొనసాగునుంది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అర్ధరాత్రి జరిగే లింగోద్భవ అభిషేకం వరకు భక్తులను మహాలఘు దర్శనానికి అనుమతించేందుకు ఏర్పాట్లు చేశారు.

**కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగుతుంది. వేకువ జాము నుంచే సుదూర ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల నుంచి కాళేశ్వరం చేరుకుంటున్నారు. త్రివేణి సంగమ గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత నదిమాతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. గర్భాలయంలో స్వామివారికి మారేడు దళాలు సమర్పించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

**శ్రీశైలంలో భక్తుల రద్దీ**

శ్రీశైల క్షేత్రంలో ఆదివారం తెల్లవారుజాము నుంచే భారీగా భక్తులు దర్శనానికి వస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినం కావడంతో భక్తుల శివనామ స్మరణతో శ్రీశైలం మారుమోగింది. భక్తితో దీపాలను వెలిగించి, తాము కోరుకున్న కోరికలు తీరాలని ఆ శివయ్యకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా శివమాలతో దర్శనానికి వస్తున్నామని శివస్వాములు పేర్కొంటున్నారు. బొందితో స్వర్గానికి వెళతారనే నమ్మకం ఒకటైతే, ఏ కోరికతో మహా శివరాత్రి నాడు దర్శనం చేసుకుంటామో.. ఆ కోరిక కచ్చితంగా నెరవేరుతుంది అని శివ భక్తులు చెబుతున్నారు.

**రాజన్నకు కోడె ముక్కలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. స్వామి వారిని దర్శించుకుని భక్తులు కోడె మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇక, ఆలయం మొత్తం శివ నామస్మరణలతో మార్మోగుతుంది. ఆదివారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. శంకర మఠంలో అనువంశిక అర్చకులచే మహా లింగార్చన, రాత్రి లింగోద్భవం సమయంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చే అర్చకులు నిర్వహించారు.

# హాంగూ హస్తగతమే



## నేడు మేయర్, ఛైర్మన్ల ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

ఆదిలాబాద్ ఛైర్మన్ పీఠాలపై ఆశలు పెట్టుకోగా, భైంసాను ఎంఐఎంకు వదిలేసి మిగతా మునిసిపాలిటీలన్నీ కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ ఈ మేరకు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. కరీంనగర్ కార్పోరేషన్ లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించగా, మిగతా పక్షాలను ఏకం చేయడంలో కాంగ్రెస్ విజయవంతమవుతోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ రంగంలోకి దిగడంతో సీన్ మారుతోంది. ఈ కార్పోరేషన్ కైవసానికి పొన్నం పట్టుదలగా ఉన్నారు. ఆదిలాబాద్ లో మొత్తం 49 స్థానాలుండగా మ్యాజిక్ ఫిగర్ కు 25 అవసరం. బీజేపీకి 21 స్థానాలు ద్కాయి. ఐదుగురు ఇండిపెండెంట్లు అక్కడ ఉన్నారు. వారితో కలిసి బీజేపీ మున్సిపల్ ఛైర్మన్ కోసం ప్రయత్నం చేపట్టగా, కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి చక్రం తిప్పారు. నలుగురు ఇండిపెండెంట్లను కాంగ్రెస్ క్యాంపుకు తరలించారు. ఎంఐఎం, బీఆర్ఎస్ తో కలిసి కాంగ్రెస్ బలం 27కు పెరగ్గా, ఈ మునిసిపాలిటీని కైవసం చేసుకోనుంది. ఆదిలాబాద్ మునిసిపాలిటీని కైవసం చేసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిలు కంది శ్రీనివాసరెడ్డితో మాట్లాడినట్లు తెలుస్తోంది. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు మాట్లాడి ఆదిలాబాద్ గెలుపుపై కార్యాచరణ నిర్దేశించినట్లు తెలుస్తోంది. నరేష్ జాదవ్, కంది శ్రీనివాసరెడ్డి ల శ్రమతో ఆదిలాబాద్ మునిసిపాలిటీ రాజకీయం మారిపోయింది. తొర్రూరులో బీఆర్ఎస్ కు మునిసిపాలిటీ పీఠం దక్కకుండా టీపీసీసీ అధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఎక్స్ అఫీషియోగా ఎంపీ కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చేరడంతో రాజకీయం మారిపోయింది. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లతో చర్చలు జరిపి, జగిత్యాల మునిసిపాలిటీలో ఛైర్మన్ వివాదానికి కాంగ్రెస్ హైకమాండ్ తెరదించింది. కార్పోరేషన్ లలో ఒక్క కొత్తగూడెంలోనే సీపీఐతో పవర్ షేరింగ్ అగ్రిమెంట్ ఉండగా, మిగతా ఆరు కార్పోరేషన్లు కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. కామారెడ్డిలోనూ మాజీ మంత్రి షబ్బీర్ అలీ చక్రం తిప్పి ఇండిపెండెంట్లతో పాటు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లను కూడా తనవైపు తిప్పుకున్నారు. నారాయణపేటలో ఎక్స్ అఫీషియో రాజకీయం సాగుతోంది. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ ఎక్స్ అఫీషియోతో చక్రం తిప్పుతున్నాయి. మొత్తంగా హంగ్ లలోనూ కాంగ్రెస్ మెజారిటీ స్థానాలు హస్తగతం చేసుకునేలా పనిచేస్తోంది.

# పాలకుడిగా నేను ఎప్పుడూ ప్రవర్తించలేదు

## సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా...

**అన్ని వర్గాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం**

**సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు**

(మొదటిపేజీ తరువాయి)

తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. తాను గతంలో జడ్పీటీసీగా గెలిచేందుకు సహకరించింది నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లోని లంబాడీ యువకులేనని తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలోని ప్రతి సందర్భంలో లంబాడీలు తనకు అండగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్టంలోని అన్ని తండాల్లో రహదారులు మంచిగా ఉండాలనే ఆలోచనతోనే బీటీ రోడ్లు వేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు ఏర్పాట్లు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంటు ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

**సన్నబియ్యం ధరలు తగ్గాయ్**

ప్రస్తుతం మార్కెట్‌లో కిలో సన్నబియం ధర రూ. 45కు తగ్గిందని ముఖ్యమంత్రి చెప్పారు. 51 లక్షల పేద కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని 40 శాతం మెస్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు గ్రూప్ 1 ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం భూములు లేవని, కానీ ప్రజలకు సంక్షేమంతో పాటు విద్య ఇవ్వాలనుకుంటున్నట్లు సీఎం చెప్పారు. చదువు వల్ల కీలక పదవులు వస్తాయన్న ఆయన, చదువుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాలురకు 100, బాలికలకు 200 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తాను చేయించిన సర్వేలో ఆస్తుల వల్ల కాదు, చదువు లేకపోవడం వల్ల పేదరికం వచ్చినట్లు తేలిందన్నారు. వెనుకబాటు తనం అన్నది ఒక శిక్ష అని, చదువు ఒక్కటే సమాజంలో ఒక హోదాలో నిలబెడుతుందని స్ఫూర్తి నింపారు. పేద పిల్లలకు చదువు అందించడానికి ఎన్ని డబ్బులు అయినా ఖర్చు చేస్తానన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపై విపక్ష నేతలు ప్రజలను నిందిస్తున్నారని మండిపడ్డారు.

## చేతులెత్తేసిన పాకిస్థాన్

(మొదటిపేజీ తరువాయి)

పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ (44) ఒంటరి పోరాటం చేశాడు. టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసింది . 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ ఆరంభంలోనే టాపార్డర్ వికెట్లు కోల్పోయింది. ఉస్మాన్ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. అతడికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లభించకపోవడంతో పాక్ ఏ దశలోనూ టార్గెట్‌ను ఛేదించేలా కనిపించలేదు. చివరకు పాక్ 18 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో అక్షర్, బుమ్రా, వరుణ్, హార్దిక్ రెండేసి వికెట్లు పడగొట్టారు. తిలక్, కుల్దీప్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. టీ20 ప్రపంచకప్‌లలో పాక్‌పై భారత్‌కు ఇది ఎనిమిదో విజయం. పాక్ మాత్రం ఇప్పటికి ఒక్కసారే గెలుపొందింది.

## జనజీవన స్రవంతిలోకి రావాలి

**మావోయిస్టులకు డిజిపి పిలుపు**

(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. వీరందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస పథకం కింద లభించే అన్ని రకాల ప్రయోజనాలను అందజేశామని, ప్రస్తుతం వీరంతా తమ సొంత గ్రామాల్లో కుటుంబాలతో కలిసి ఎంతో క్షేమంగా, సంతోషంగా జీవిస్తున్నారని డిజిపి వారిని అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస పథకాల పట్ల నమ్మకం, అమలు తీరు చూసి ఇతర రాష్ట్రాల్లో ఉన్న అజ్ఞాత మావోయిస్టులు సైతం ఇక్కడి పోలీసుల ఎదుట లొంగిపోయి సమాజంలో కలిసిపోతున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన మిగిలిన 15 మంది మావోయిస్టు నాయకులు, కేడర్ ఈ అవకాశాన్ని వినియోగించుకుని శాంతియుత భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని డిజిపి శివధర్ రెడ్డి పునరుద్ఘాటించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందజేయడంతో పాటు, వారు సమాజంలో ఆత్మగౌరవంతో బతికేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాంతియుత మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, సాయుధ మార్గం, అజ్ఞాతవాసం వీడి బయటకు రావడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిజిపి సూచించారు.

## మంత్రులతో సీఎం రేవంత్ జూమ్ మీటింగ్



**హైదరాబాద్, మహా :** సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో జూమ్ మీటింగ్ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో.. మేయర్లు, చైర్మన్ల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. సోమవారం చైర్ పర్సన్లు, మేయర్ల ఎన్నిక ఉండనుండటంతో.. వారిని ఎలా ఎన్నుకోవాలన్నదానిపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో 85 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మరో 10 స్థానాలను కూడా చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఒక్కో మున్సిపాలిటీ, కార్పొరేషన్లో వార్డు సభ్యులతో పాటు మీటింగ్ కు వచ్చే ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు కలిపి 50 శాతానికి పైగా ఓట్లు వచ్చిన అభ్యర్థిని మేయర్, డిప్యూటీ మేయర్, చైర్ పర్సన్, డిప్యూటీ చైర్ పర్సన్ గా ఎన్నుకుంటారు. ఇందుకు సంబంధించిన సమీకరణలన్నీ సెట్ చేయగా, ఛైర్మన్, మేయర్ ల ఎన్నిక పూర్తయ్యే వరకు అలర్ట్ గా ఉండాలని ఆదేశించారు.


## నేడు ఏపీకి బిల్ గేట్స్

- సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై చర్చలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి

**అమరావతి, మహా:** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు. సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు.

# అక్షర చిట్ ఫండ్స్ డైరెక్టర్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)



డబ్బులు కోసం వారి ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారి పోతున్నారు. ఈ నేపథ్యంలోనే వరంగల్ నగరానికి చెందిన అక్షర చిట్ ఫండ్స్ డైరెక్టర్ పేరాల శ్రీ విద్యను సుబేదారి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. 2022లో నమోదైన చిట్ ఫండ్ మోసం కేసులో ఆమె ప్రధాన నిందితురాలిగా ఉన్నారు. గత కొంతకాలంగా పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సుబేదారి పోలీసులు బెంగళూరు విమానాశ్రయంలో నాటకీయ పరిణామాల మధ్య అదుపులోకి తీసుకున్నారు. అమెరికాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలోనే ఆమెను పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**పెట్టుబడిదారుల ఫిర్యాదు కేసు నమోదు**

2022లో సుబేదారి పోలీస్ స్టేషన్ లో కొంతమంది పెట్టుబడిదారుల చేసిన ఫిర్యాదులతో శ్రీ విద్య పై మోసం కేసు నమోదైంది. చిట్ ఫండ్ పేరుతో అధిక లాభాల హామీలు ఇచ్చి పలువురు పెట్టుబడిదారుల నుంచి లక్షల రూపాయలు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గడువు పూర్తైన తర్వాత డబ్బులు చెల్లించకుండా కార్యాలయాన్ని మూసివేసి పరారైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**ఫలించిన పోలీస్ ప్రత్యేక బృందం ఆపరేషన్**

ఫిర్యాదు తో కేసు నమోదు అయిన తర్వాత సంస్థ డైరెక్టర్ శ్రీ విద్య కొంతకాలం వరంగల్‌లోనే ఉండి, అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె విదేశాలకు పారిపోయే ప్రయత్నం చేస్తున్నారన్న పక్కా సమాచారంతో లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. బెంగళూరు కు వెళ్లి అక్కడి నుంచి అమెరికాకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెను అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. అరెస్టు అనంతరం శనివారం రాత్రి ఆమెను వరంగల్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించిన అనంతరం ఆమెను నర్సంపేట సబ్ జైలు కు తరలించారు. కేసు పై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. దీంతో సుబేదారి పోలీసుల ప్రత్యేక బృందం చేపట్టిన ఆపరేషన్ సక్సెస్ అయింది.

**సంస్థ లావాదేవీల పై పోలీసుల దర్యాప్తు**

అక్షర చిట్ ఫండ్స్ సంస్థకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఆస్తులు, లావాదేవీల పై పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. బాధితుల నుంచి ఇంకా ఫిర్యాదులు రావొచ్చని భావిస్తున్న పోలీసులు, ఎవరైనా మోసపోయి ఉంటే ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. సంస్థలో ఇతర భాగస్వాములు లేదా సహకరించిన వ్యక్తులు ఉన్నారా అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. శ్రీవిద్య అరెస్ట్‌తో బాధితుల్లో కొంత ఊరట కనిపిస్తున్నప్పటికీ, తమ డబ్బులు తిరిగి వస్తాయా లేదా అనే ఆందోళనలో బాధితులు ఉన్నారు. పోలీసుల దర్యాప్తు పూర్తయ్యాక తదుపరి చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈమె అరెస్ట్ ఉమ్మడి జిల్లాలో చర్చనీయంశమైంది. కేసు పురోగతి పై ఇటు బాధితులు అటు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పోలీసులు కొనసాగిస్తున్న దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## అమెరికా వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కార్‌పై రాహుల్ దాడి

**ప్రధాని మోదీకి 5 సూటి ప్రశ్నలు**

**భారత వ్యవసాయంపై అమెరికా పట్టు**



**ఢిల్లీ, మహా:** భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు. డీడీజీ (డిస్టిల్లర్స్ డ్రైడ్ గ్రెయిన్) దిగుమతి చేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అంటే, అమెరికా జీఎం మొక్కజొన్నల నుంచి తీసిన ధాన్యాన్ని మన పశువులకు మేపడమేనా? ఇది మన పాల పరిశ్రమను అమెరికా వ్యవసాయ వ్యవస్థతో అనుసంధానం చేయదా? జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన సోయా రైతుల పరిస్థితి ఏంటి? మరోసారి ధరల పతనాన్ని వారు ఎలా తట్టుకుంటారు? మీరు చెబుతున్న 'అదనపు ఉత్పత్తులు' జాబితాలో ఏముంటాయి? పప్పుధాన్యాలు, ఇతర సున్నితమైన పంటలను కూడా కాలక్రమేణా అమెరికా దిగుమతులకు తెరవాలనే ఒత్తిడికి ఇది సంకేతమా? 'వాణిజ్యేతర అడ్డంకులు' తొలగించడం అంటే ఏమిటి? జీఎం పంటలపై భారత్ తన వైఖరిని నీరుగార్చాలా? సేకరణను బలహీనపరచాలా? లేదా భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్‌లను నిర్వీర్యం చేయాలా? ఒక్కసారి ఈ తలుపు తెరిస్తే, అది ఏటా మరింత పెద్దది కాకుండా ఎలా నివారిస్తాం? రైతులకు తగిన రక్షణ కవచాలు ఉంటాయా? లేక ప్రతి చర్చలోనూ మరిన్ని పంటలను బేరసారాలకు పెడతారా?



**బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి**

## భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

(మొదటిపేజీ తరువాయి)

ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. "చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మన స్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రకటనలో పేర్కొంది.

# కరీంనగర్ పవర్ పాలిట్రిక్స్

(మొదటిపేజీ తరువాయి)

మా ప్రయత్నం మేము చేసుకుంటాం' అంటూ బీజేపీకి చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ పెద్దలు పావులు కదుపుతున్నారు. కరీంనగర్ పీఠాన్ని దక్కించుకోవాలని ముఖ్యమంత్రి ఆ బాధ్యతలను జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అప్పగించారు. వారు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దుతున్నారు. శామీర్పేట్ లియోనియో రిసార్టులో తమ కార్పొరేటర్లతో పాటు కొందరు స్వతంత్రులతో మకాం వేసిన కాంగ్రెస్ అక్కడి నుంచి క్యాంపు రాజకీయాలు సాగిస్తోంది. ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ శిబిరంలో ముగ్గురు ఇండిపెండెంట్లు ఇద్దరు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు చేరారు. మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 14 మంది కార్పొరేటర్లు ఫార్వర్డ్ బ్లాక్ ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు నలుగురు ఎంఐఎం ముగ్గురు కార్పొరేటర్ తో పాటు టిఆర్ఎస్ కార్పొరేటర్లు 9 మంది కూడా మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. మీరంతా కలిసి 32 మంది కార్పొరేటర్ అవుతున్నారు. మ్యాజిక్ ఫిగర్ 35 కార్పొరేటర్లు అవసరం ఉంటుంది. బిజెపి శిబిరం నుంచి ఒకరు తమకు మద్దతు తెలుపుతారని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకరు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎక్స్ అఫీషియో మెంబర్లుగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరు రెండు ఓట్లతో 34 ఓట్లు అవుతున్నాయి. దీంతో మేయర్ పీఠంపై కాంగ్రెస్ పార్టీ గురి పెట్టింది. ఎలాగైనా దక్కించుకోవాలని సంకల్పంతో ముందుకు సాగుతుంది. బిజెపికి మేయర్ పదవి దక్కకుండా అన్ని శక్తియుక్తులను ప్రయోగిస్తున్నది. మేరు పీఠం ఆశిస్తున్న వారిలో స్వతంత్ర కార్పొరేటర్ సొగాని కొమరయ్య 46వ డివిజన్ నుంచి గెలుపొందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున రాజేందర్ పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు మంత్రులు స్థానిక ముఖ్య నాయకుల మద్దతు మల్లికార్జున రాజేందర్ కే ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

ఒకవేళ మీట్ మేయర్ పీఠం కాంగ్రెస్ దక్కించుకుంటే మాత్రం రాజేందర్ కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.. మొదటి నుంచి పార్టీలో లాయాల్ గా ఉండడం అందరితో కలిసిమెలిసి క్రమశిక్షణతో మెదలుతుండడం కలిసి వచ్చే అవకాశం. ఒక్క సరిగా కరీంనగర్ రాజకీయాలు వేడెక్కాయి. క్షణక్షణం మారిపోతున్నాయి. ఫలితాలు వెలువడిన వెంటనే బిజెపి పార్టీలో చేరిన ఫార్వర్డ్ బ్లాకు కార్పొరేటర్ తిరిగి హస్తం పార్టీ శిబిరంలో చేరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బిజెపి ముఖ్య నేతలు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తున్నారు. బిజెపిలోను మేయర్ పీఠం దక్కించుకునేందుకు తీవ్ర పోటీ ఉంది. ఇక్కడ బండి సంజయ్ నిర్ణయమే కీలకంగా కానుంది. మేయర్ రేసులో బండారి వేణు వాసాల రమేష్ కొలగాని శ్రీనివాస్ ఉన్నారు. ఒకవేళ బిజెపి మేర అభ్యర్థి పీటం తగ్గించుకుంటే వీరిలో ఒకరు మేయర్గా ఎంపిక అవుతారు. బిజెపికి ప్రస్తుతం 33 మంది కార్పొరేటర్లు ఉన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎక్స్ అఫీషియో మెంబర్గా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరి సంఖ్య 34. ఎట్టి పరిస్థితుల్లో బిజెపి మేయర్ కావడమే ఏ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఆ అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఇవ్వవద్దని వారికి చెక్ పట్టేందుకు బండి సంజయ్ రంగంలోకి దిగారు. సోమవారం జరగనున్న కరీంనగర్ కార్పొరేషన్ నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేటర్ అభ్యర్థుల ప్రమాణస్వీకారం తో పాటు మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బిజెపి కాంగ్రెస్ ఎత్తులకు పై ఎత్తులు ఎలా ఉంటాయి వారి వ్యూహాలు ఫలిస్తాయా ఎవరు మేయర్ అవుతారు ఏ పార్టీకి దక్కుతుంది.. అన్న విషయాలు సోమవారం తెలిసిపోతాయి. క్షణక్షణం రాజకీయాలు మారిపోడుతుండడంతో ఏ పార్టీకి లక్కు కలిసి వస్తుందో వేచి చూడాలి మరి.

# బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి పోటెత్తిన భక్తులు

- శివరాత్రికి పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టిసి బస్సుల ఏర్పాటు
- ట్రాఫిక్ జామ్ తో భక్తుల ఇక్కట్లు



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ శివారు లోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు అధికసంఖ్యలో తరలిరావడం జరిగింది. ఆదివారం నాడు ఉదయం వేళ నుండే భక్తులు ఆలయానికి పోటెత్తడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖ తోపాటు పోలీసు శాఖ సంయుక్తంగా క్యూ లైన్లను ఏర్పాటు చేసి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించారు .అయితే ఆలయానికి వెళ్లే రహదారి రెండు మార్గాలుగా ఉండడంతో కన్నాల గ్రామపంచాయతీ నుండి వెళ్లే రహదారి ఇరుగ్గా ఉండడంతో వాహనాలు ట్రాఫిక్ జామ్ తో అసౌకర్యం ఏర్పడింది.. పోలీసు శాఖ వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్ ను కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయడం జరిగింది. బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ డి మహేష్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి బాపురెడ్డిల ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆలయానికి విచ్చేయడంతో ప్రత్యేకంగా ఆహ్వానించి పూజాది కార్యక్రమాలను నిర్వహించి రాజరాజేశ్వర స్వామికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక పూజలు అనంతరం మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించినట్లు వెల్లడించారు. ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా టిజి ఎస్ ఆర్ టి సి బెల్లంపల్లి పట్టణంలోని రెండు ప్రాంతాల నుండి బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుగ్గ జాతర ఏర్పాట్లను బెల్లంపల్లి ఏసీపి రవికుమార్ పర్యవేక్షించి పోలీస్ శాఖ సిబ్బందికి ప్రత్యేక సూచనలు చేయడం జరిగింది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు బెల్లంపల్లి ఎంపీడీవో తో పాటు తాండూర్ ఎంపీడీవో సిబ్బందిని కేటాయించి శుభ్రపరిచారు. ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో భక్తులకుమంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయగా పురగిరి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. బుగ్గ జాతరకు బెల్లంపల్లి తో పాటు ఆసిఫాబాద్ మంచిర్యాల ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా బెల్లంపల్లి పట్టణంలోని శివాలయాలు అన్ని శివనామస్మరణతో మారు మ్రోగాయి



# నేడు బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపిక

### బెల్లంపల్లి సబ్ కలెక్టర్ & మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ మనోజ్ వెల్లడి

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపల్ పాలకవర్గానికి సోమవారం నాడు ఉదయం 11 గంటలకు చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపిక నిర్వహించడం జరుగుతుందని బెల్లంపల్లి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ & బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ వెల్లడించారు. ఆదివారం నాడు ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి మున్సిపల్ ప్రత్యేక అధికారి మనోజ్ మాట్లాడుతూ ఈనెల 16 (సోమవారం)ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం మందిరంలో చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ ఎంపిక జరుగుతుందని తొలుత మున్సిపల్ చైర్మన్ ఎంపికను నిర్వహిస్తామని అందుకు సంబంధిత సంబంధిత ఆయా వార్డుల నుండి గెలుపొందిన సభ్యులు తమ మద్దతును చెయ్యెత్తి ప్రకటించాల్సి ఉంటుందని అన్నారు.అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంపిక నిర్వహించడం సైతం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత ఎన్నికల్లో మున్సిపల్ కౌన్సిల్కు ఎంపికైన వార్డు సభ్యులు మరియు ఎక్స్ అఫీషియో మెంబర్లు మాత్రమే పాల్గొంటారని, ఎన్నిక పరోక్ష పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత చైర్మన్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపికలో సభ్యులు తమ ఇష్టానుసారం మద్దతును ప్రకటించే అవకాశం ఉందని, సంబంధిత చైర్మన్ అభ్యర్థికి చేతిని పైకి ఎత్తి మద్దతు తెలిపావాల్సి ఉంటుందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నిక మున్సిపల్ చైర్మన్ ,వైస్ చైర్మన్ ఎంపిక సోమవారం నాడు జరుగుతున్నందున కాంగ్రెస్ పార్టీ వీపును జారీ చేయడం జరిగిందని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఫారం వన్ ను అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జారీ చేసిన విప్తో కాంగ్రెస్ పార్టీ సూచించిన మున్సిపల్ చైర్మన్ ,వైస్ చైర్మన్ లకు మాత్రమే మద్దతును తెలపాల్సి ఉంటుందనే నిబంధన ఉంటుందని తెలిపారు. మున్సిపల్ పాలకవర్గానికి జరుగుతున్న చైర్మన్ & వైస్ చైర్మన్ ఎన్నికల కోసం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న మనోజ్ ను మున్సిపల్ బెల్లంపల్లి మున్సిపల్ కు ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.



# విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి శ్రీపతి నగర్ లో ఆదివారం ఉదయం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో తుమ్మ సదానందం అనే సింగరేణి ఉద్యోగి నివాసంలో మంటలు చెలరేగి ఇంట్లో టేకు వస్తువులు, దుస్తులు, ఇతర సామాన్లు దగ్ధమయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం ఇంటి యజమాని సదానందం తన విధులకు వెళ్లినట్లు తెలిపారు.తన భార్య రమణి మరో రూమ్ లో పని పనిచేస్తుందని అన్నారు.ఈ క్రమంలో ఇంటి యజమాని తల్లి నివాసంలో మంటలు చెరలేగుతున్నాయని ఎక్కడో చూడని కేకలు వేసిందని చెప్పారు. ఒక్కసారిగా కంగారు పడి ఇంట్లోకి వెళ్లి సదానందం భార్య రమ చూడగా ఇంటి లో ఉన్న రెండు రూములు నుండి మంటలు వస్తున్నట్లు గుర్తించిందని స్పష్టం చేశారు. దీనితో బాధితులు బయటకు వెళ్లి అరవడంతో చుట్టుపక్కల వాళ్ళు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారని వివరించారు.ఈ మంటల వల్ల ఇంట్లో ఉన్న విలువైన టేకు సామాగ్రి పూర్తిగా దగ్ధమైందని వివరించారు. ఈ వస్తువుల విలువ దాదాపు 8 లక్షల రూపాయల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. సమాచారాన్ని అందుకున్న స్థానిక ఎస్సై నరేష్ ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద ఘటన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కాగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదును అందుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గంగానది తీరంలో శివ నామస్మరణం

### పలు దేవాలయాలకు పోటెత్తిన భక్తజనం



**మంచిర్యాల, మహా :** గంగా, గోదావరి నది తీరంలో ఆదివారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆ ప్రాంతమంతా భక్తజనం శివ నామ స్మరణంతో కిటకిటలాడాయి. లక్షటి పేట గంగా గోదావరి నది తీరం నుండి మంచిర్యాల, సీతారాంపల్లి పంపు హౌస్, గోదావరిఖని అంబేద్కర్ గోదావరి బ్రిడ్జి, వేలాల గోదావరి నది తీరం, చెన్నూరు గోదావరి నది తీరంలో వేలాదిమంది భక్తులు వారి కుటుంబ సభ్యులతో గోదావరి నదిలో స్నానం చేసి మంచిర్యాల గౌతమేశ్వర దేవాలయం, వేలాల గట్టు మల్లన్న దేవాలయం, చెన్నూరు కత్తెరసాలలోని శివాలయం, బెల్లంపల్లి బుగ్గ రాజేశ్వరి దేవాలయాలలో భక్తజనం తమ ఆరాధ్య దైవాలను శివపార్వతులను దర్శించుకున్నారు. ఈ ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ భారీ బందోబస్తు నిర్వహించారు. నది తీర ప్రాంగణం, వివిధ దేవాలయాల ప్రాంగణాలు ఉదయం 4 గంటల నుండి ఓం నమశ్శివాయ అనే నామస్మరణతో సందడి చేశాయి. వేలాల మల్లన్న దేవాలయాన్ని చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద తన సతీమణి సరోజతో దేవాలయానికి వెళ్లి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా వర్ధిల్లి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆయన కోరినట్లు వెల్లడించారు. కొన్ని సంవత్సరాలుగా ఆలయానికి రోడ్డు సౌకర్యం లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అయితే ఈ రోడ్డుకు అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో సౌకర్యాలు ఇబ్బందిగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో అటవీ శాఖ అధికారులతో మాట్లాడి అనుమతులు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ట్రాఫిక్ వసతులు కల్పించామని స్పష్టం చేశారు. ఇదివరకే నెలకు ఒకసారి గిరి ప్రదర్శన ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కత్తెరసాల మల్లన్న దేవాలయ అభివృద్ధి కొరకు 20 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు వివరించారు.

# శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు

- ఆలయాలకు బారులు తీరిన భక్తులు..
- సంగమేశ్వర మందిరంలో రుద్రాభిషేకాలు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు. శివపార్వతుల కళ్యాణం.. పల్లకి సేవ...



**సంగారెడ్డి ప్రతినిధి :మహా:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నాడు పట్టణ మరియు మండల గ్రామాలలోని శివాలయాలలో ఉదయం 6 గంటల నుండి స్వామివారిని దర్శించేందుకు భక్తులు బారులు తీరారు. మండలంలోని నందికంది గ్రామ శ్రీరామలింగేశ్వర ఆలయం దర్శించేందుకు మండలంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శివలింగాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బుచ్చప్ప. గ్రామ సర్పంచ్ ఆర్ స్రవంతి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని శ్రీ సంగమేశ్వర మందిరం. శంబి లింగేశ్వర మందిరం. ఈశ్వర మార్కండేయ మందిరం. బసవేశ్వర మందిరం. రవీంద్ర మాడల్ దగ్గర శివాలయం తదితర శివ ఆలయాలలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఓంనమశ్శివాయ నామస్మరణల మధ్య శివాలయాలు మార్మోగాయి. స్థానిక శ్రీ సంగమేశ్వర మందిరం ఆలయ భజన భక్త బృందం. పూజారులు జి మోహన్రావు. బి ఎన్ శంకర్రావు. నారాయణరావుల ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం8 గంటల వరకు సామూహిక రుద్ర అభిషేకం. దిల్వర్చన ప్రత్యేక పూజలతో పాటు ఆలయంలో 7 గంటల నుండి నాట్ శిల్పా అకాడమీ శ్రీమతి భాగ్యరేఖ ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నృత్యాలు. వివిధ సంస్కృతి కార్యక్రమాలు 9 గంటల నుండి 12.30 వరకు కీర్తిశేషులు పాండురంగారావు రామదాసు దివ్య ఆశీస్సులతో. తిరు మల తిరుపతి దేవస్థానం సంగారెడ్డి బ్రహ్మశ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ పురాణ పండిత్ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ కథ శ్రవణం. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం. ఉత్సవమూర్తుల పల్లకి సేవ. ఆలయ కమిటీ భజన భక్త బృందం ఆధ్వర్యంలో తెల్లవార్లు భజన కార్యక్రమం. కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మారేపల్లి వెంకటేశం గౌడ్ సౌజన్యంతో లడ్డు ప్రసాద వితరణ. ఈ ఉత్సవాలలో ఆలయ కమిటీ భక్త బృందం మల్లికార్జున పూర్ణచందర్. ఆకుల శివ కుమార్ మారేపల్లి చిన్న శివకుమార్. సుధాకర్. రాచన్న స్వామి. రామ్ రెడ్డి సుబ్రమణ్యం మణికంత. తదితర భజన భక్త బృందం పాల్గొన్నారు.

# వేలాల జాతరలో గుండెపోటుతో ఒకరు మృతి

**జైపూర్ / మంచిర్యాల, మహా :** మంచిర్యా జిల్లా జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధి వేలాల గట్టు మల్లన్న జాతరకు వచ్చిన నస్పూర్ పట్టణానికి చెందిన బింగి రాజేందర్ (45) అనే వ్యక్తికి గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మహాశివరాత్రి సందర్భంగా వేలాల గట్టు మల్లన్నను దర్శించి మొక్కులు చెల్లించుకునేందుకు భార్య తో రాజేందర్ దేవాలయానికి వచ్చారు. ఈ క్రమంలో గుట్ట ఎక్కుతుండగా గుండె నొప్పి వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనితో కుటుంబ సభ్యులు రోధనలు చేశారు. శివరాత్రి పండగ పూట ఆ భక్తుని ఇంట్లో విషాదాన్ని నింపడంతో భక్తులు విచారణ వ్యక్తం చేశారు. కాగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# బెల్లంపల్లి మున్సిపల్ పాలనపగ్గాలు హస్తం చేతికైనా?

**బెల్లంపల్లి, మహా;** బెల్లంపల్లి మున్సిపల్ పాలన పగ్గాలను హస్తం పార్టీ తన చేతికి చేజిక్కించుకున్నట్లు తెలుస్తోంది. సోమవారం రోజు మున్సిపల్ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక జరగనున్నందున కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేగడ్డం వినోద్ తన రాజకీయ చతురతను ప్రదర్శించి నలుగురు స్వతంత్ర అభ్యర్థులతో పాటు ఒక బీజేపీ వార్డు కౌన్సిలర్లు తన శిబిరంలోకి చేర్చుకున్నట్లు సమాచారం దీంతో వారి సంఖ్యాబలం ఇదివరకు 14 వాడు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలో వేసుకోగా మరో నలుగురు మద్దతు ప్రకటిస్తున్నంధున 18కి చేరుకున్నారు. ఎక్సాఫీస్ యువర్ మెంబెర్ గా అవకాశం ఉన్న ఎమ్మెల్యే సైతం ఓటు వేసే అవకాశం ఉన్నందున చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ పదవులను హస్తం పార్టీ వశం అయ్యేందుకుకు మార్గం సులభతరం అయింది. బిఆర్ఎస్ పార్టీకి సంఖ్యాబలం 14 ఉండగా హస్తం పార్టీకి సంబంధించిన వార్డు కౌన్సిలర్ కుమారస్వామి బిఆర్ఎస్ పార్టీ కండువాను శనివారం నాడు కప్పుకోగా స్వతంత్ర అభ్యర్థి సుఖేష్ ని భరద్వాజ్, 34 వ వార్డు బిజెపి అభ్యర్థిగా గెలుపొందిన కొక్కుల రామ్మూర్తి సైతం కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తామని ప్రకటించిన మరుసటి రోజే హస్తం పార్టీ నేతలు ఒకసారిగా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీంతో రంగంలోకి దిగిన ఎమ్మెల్యే గడ్డం వినోద్, ముఖ్య నేతలతో చర్చించి బెల్లంపల్లి మున్సిపల్ పాలనా వర్గాలు ఎలాగైనా చేజిక్కించుకోవాలని హస్తం పార్టీ మున్సిపల్ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ గా ఎంపిక సోమవారం నాడు ఉండగా ఆదివారం రోజే బెల్లంపల్లి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తున్న మనోజ్ కు ఫారం వన్ ఎన్నికల నిబంధనల ప్రకారం అందజేసి కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేసింది. దీంతో హస్తం పార్టీ నుండి గెలుపొందిన వార్డు కౌన్సిలర్లు హస్తం పార్టీకి సంబంధించిన చైర్మన్ మున్సిపల్ చైర్మన్ మద్దతు ప్రకటించాల్సి ఉంటుంది లేని పక్షంలో అనర్హత వేటు పడే అవకాశం ఉన్నందున బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్న అభ్యర్థుల్లో కలవరం మొదలైంది. హస్తం పార్టీ నుండి గెలుపొందిన వార్డు కౌన్సిలర్ చైర్మన్ పదవిని ఆశిస్తూ సంబంధిత ముగ్గురు వార్డు కౌన్సిలర్లను కేటీఆర్ సమక్షంలోకి పంపించినట్లు వదంతులు వినిపిస్తున్నాయి. దీంతో ఆందోళనకు గురైన ఎమ్మెల్యే గడ్డం వినోద్ నుండి బెల్లంపల్లి మున్సిపల్ పాలన వర్గాలను హస్తం చేతికి వచ్చేలా తన వ్యూహరచనతో కాంగ్రెస్ శిబిరం మ్యాజిక్ ఫిగర్ దాటే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో బెల్లంపల్లి మున్సిపల్ పాలన వర్గాలను పాలనా పగ్గాలను హస్తం పార్టీ సునాయాసంగా కైవసం చేసుకునేందుకు మార్గం సుగమం అవుతుందనడంలో అతిశక్తి లేదు.

# కాశిబుగ్గ శివాలయంలో ఎర్రబెల్లి ప్రత్యేక పూజలు

### యువత మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి



**వరంగల్ మహా;** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం వరంగల్ కాశిబుగ్గలోని శివాలయంలో బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన భక్తులతో కలిసి పరమశివునికి అభిషేకాలు, అర్చనలు చేసి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. మహాశివరాత్రి వంటి ఆధ్యాత్మిక పర్వదినాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇవి సమాజంలో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని ప్రదీప్ రావు పేర్కొన్నారు. యువత ఆధ్యాత్మికం వైపు పయనించాలని భారతీయ సంస్కృతిని ఆచరిస్తూ ధార్మిక విలువలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి పైర్ద ఆనంద్, జిల్లా అధికార ప్రతినిధి రత్నం కృష్ణ కిషోర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోమాకుల నాగరాజు, సీనియర్ నాయకులు ప్రభాకర్, గుర్రపు సత్యనారాయణ, రాఘవాచారి, ఆళ్లీ అజయ్, మామిడాల సతీష్, కోట సతీష్, బైరి హరీష్, కందుకూరి శ్రీనివాస్, క్రాంతి,ఓని వెంకటేష్ తో పాటు స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సర్పంచ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

### నంది కంది సర్పంచ్ రాచర్ల స్రవంతి విజయభాస్కర్ రెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి: మహా:** నంది కంది సర్పంచ్ రాచర్ల స్రవంతి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టినటువంటి భక్తులకు శ్రీరామలింగేశ్వరం ఆలయంలో పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులకు పండ్లు పంపిణీ చేయడం జరిగిందిఅన్నారు. పరమశివుని ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు.



# నిజాంపూర్ కాలనీ పాఠశాలలో ఆధార్ నవీకరణ

**సంగారెడ్డి ప్రతినిధి: మహా:** సంగారెడ్డి జిల్లా సదాశివ పేట మండలం లోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆధార్ కార్డుల ఆధునీకరణను తగిన పరికరాలతో పాఠశాలలోనే చేపట్టారు.ఆధార్ సూపర్వైజర్ రాకేష్ బాల ఆధార్ కార్డులలో ఉన్న విద్యార్థుల కంటి,వేలి ముద్రలు మరియు ఫోటోలను,ఫోన్ నెంబర్ లను నవీకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలోనే ఆధార్ కార్డులు ఆధునీకరించటం మరియు కొత్త ఆధార్ కార్డులు పొందటానికి చేసే కార్యక్రమాల వల్ల ప్రతి ఒక్క విద్యార్థికి ఆధార్ కలిగి ఉండేలా చేయటం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో కనీసం సంవత్సరానికి మూడు సార్లు ఆధార్ క్యాప్ లు నిర్వహించాలని కోరారు. పాఠశాలలోనే ఆధార్ నవీకరణ పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత ఆధార్ సూపర్వైజర్ రాకేష్, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పరమేశ్వరుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

**హన్మకొండ మహా;** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వడ్డేపల్లి లోని ప్రసిద్ధ రాజరాజేశ్వర స్వామి దేవాలయ శివ లింగానికి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆ పరమశివుడి కృపాకటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని ప్రార్థించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆరేపల్లి గ్రామంలోని గురుధామ్ లో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# స్వతంత్ర అభ్యర్థి కాంగ్రెస్ లోకి ..

- ఫలించిన ఎమ్మెల్యే నాగరాజు రాజకీయ ఎత్తుగడ
- కాంగ్రెస్ కండువా కప్పి పార్టీ లోకి స్వాగతించిన మంత్రి పొంగులేటి



**వరంగల్ మహా;** మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో పోటీ చేసిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు సత్తా చాటడంతో కాంగ్రెస్ పార్టీకి ఊహించని విధంగా షాక్ తగిలింది. దీంతో బిఆర్ఎస్ కు 6 స్థానాలు గెలుచుకోగా కాంగ్రెస్ 5 స్థానాలు గెలుచుకుంది. వీరితోపాటు కాంగ్రెస్ నుండి టికెట్ ఆశించి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నేతావత్ శిభారాణి, రాజేందర్ గెలుపొందారు. దీంతో దీంతో అక్కడ హంగ్ ఏర్పడింది. ఇది ఇలా ఉండగా ఈ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వర్ధన్నపేట పట్టణంలో డీసీసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హోరాహోరీగా ప్రచారాలు, లబ్ధిదారులకు సంక్షేమ పథకాల తో పాటు ఓటర్లను ఎన్నో విధాలుగా ప్రలోభ పెట్టిన వీరి ప్రయత్నాలు ఫలించ లేదని వర్ధన్నపేట పట్టణ ప్రజలు తమ ఓట్లతో తెలపకనే తెలిపారు. దీంతో చేసేదేమీ లేక వర్ధన్నపేట పట్టణ మున్సిపాలిటీ పై తాను పట్టు సాధించాలనే సంకల్పంతో స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తన రాజకీయ ఎత్తుగడతో 5వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిననేతావత్ శిభారాణి రాజేందర్ ను తిరిగి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించడం తో తన ప్రయత్నం ఫలించింది. దీంతో వెంటనే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమక్షంలో తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆమెను పార్టీ లోకి సాదరంగా స్వాగతించారు.ఈ సందర్భంగా నేతావత్ శిభారాణి,రాజేందర్ మాట్లాడుతూ, 5వ వార్డు ప్రజల ఆదరణతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తాను, తన సొంత పార్టీ అయినా కాంగ్రెస్ పార్టీలో మా స్థానిక ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో మంత్రి ద్వారా పార్టీలో చేరడం నాకు చాలా సంతోషంగా ఉందని వార్డు అభివృద్ధి మరింత వేగంగా జరగాలనే దృఢ సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో మరలా చేరినట్లు తెలిపారు. 5వ వార్డు పరిధిలోని తండాలు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ సాధ్యం ప్రజలందరికీ నేను ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అందించాలనే గొప్ప సంకల్పంతోనే నేడు కాంగ్రెస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు.అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, అభివృద్ధి దిశగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతావత్ శిభారాణి, రాజేందర్ కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. వార్డు అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, బండి చైతన్య రెడ్డి, 5వ వార్డు కాంగ్రెస్ నాయకులు రాందాస్ నాయక్, బావుసింగ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# 26న విజయ్ దేవరకొండ, రష్మిక వివాహం

## ఉదయ్ పూర్ లోని ప్యాలస్ లో పెళ్లి వేడుక

మహా: టాలీవుడ్ ప్రేమ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ఈ నెల 26న రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో వీరి వివాహం అత్యంత వైభవంగా జరగబోతోంది. ఉదయ్ పూర్ లోని ప్యాలస్ లో ఇరువురి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం జరగనుంది. చాలా కాలంగా ప్రేమలో ఉన్న వీరు... చివరకు కుటుంబ పెద్దల అంగీకారంతో పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ఉదయ్ పూర్ లో వివాహానంతరం ప్రముఖుల కోసం హైదరాబాద్ లో రిసెప్షన్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ కలిశాడు. హైదరాబాద్ లోని రేవంత్ నివాసానికి వెళ్లి స్వయంగా పెళ్లి పత్రికను అందించాడు. తన పెళ్లికి రావాలని ఆహ్వానించాడు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండకు ముఖ్యమంత్రి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రూ.10 కోట్లు పెట్టినా రాదు

**సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మృణాల్ ఠాకూర్ పెళ్లి వార్తలే. వాలంటైన్స్ డే (ప్రేమికుల రోజు) నాడు మృణాల్.. హీరో ధనుష్‌ను పెళ్లాడబోతుందని తెగ ప్రచారం జరిగింది. అందులో ఏమాత్రం నిజం లేదని చెప్పినా ఎవరూ నమ్మలేదు. చివరకు వాలంటైన్స్ డేరోజు చడీచప్పుడు లేకపోయేసరికి ఇదంతా గాలిప్రచారమే అని తేలిపోయింది.**

## లైఫ్‌లో సెటిలవాలి

ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించిన దో దీవానే షెహర్ మే సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూకు హాజరైంది. అక్కడ యాంకర్.. పెళ్లి గురించి ఇంట్లో ఏమైనా ఒత్తిడి ఉందా? అని ప్రశ్నించగా మృణాల్ ఇలా స్పందించింది. మా ఇంట్లో వాళ్లు ముందు లైఫ్‌లో సెటిలవమంటున్నారు. అటు వ్యక్తిగత జీవితాన్ని, ఇటు సినీ జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం ఎంత కష్టమో ఇంట్లోవాళ్లకు తెలుసు.

## సన్యాసి జీవితమే..

యాక్టర్‌గా ఉండటం అంటే సన్యాసిగా ఉండటంలాంటిదే! తిండి, నిద్ర.. ఇలా అన్నింటినీ వదులుకోవాలి. ఎప్పుడూ ఫోకస్‌డ్‌గా ఉండాలి. ఇప్పటివరకు నాకు ఎటువంటి పీఆర్ టీమ్ లేదు. కాకపోతే నా ఇంటి అడ్రస్ అందరికీ తెలుసు కాబట్టి అక్కడ పరిస్థితులు అదుపులో ఉంచేందుకు ఒక టీమ్ పని చేస్తుంది. బయటకు వెళ్లినప్పుడు నా సేఫ్టీ కోసం ఇంకో టీమ్ ఉంది. కానీ నాపై రూమర్స్ నాకు ఫ్రీ పబ్లిసిటీని తెచ్చిపెట్టింది.

## అందులో డౌటే లేదు

రూ.3 కోట్లు, రూ.6 కోట్లు, రూ.10 కోట్లు పెట్టినా కూడా ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు. కాకపోతే నా జీవితంలో ఏది జరిగినా అది మీ అందరితో షేర్ చేసుకుంటాను. అందులో డౌటే లేదు. నాపై వచ్చే రూమర్స్‌ను పట్టించుకుంటూ పోతే కెరీర్‌పై ఫోకస్ చేయలేను అని మృణాల్ చెప్పుకొచ్చింది. 'దో దీవానే షెహర్‌మే' మూవీ ఫిబ్రవరి 20న విడుదల కానుంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034